# వాహన యోగం

ఎస్. ఎస్. శర్మ & జె.వి. స్వామి



రామారావు పడక కుర్చీలో కూర్చుని ఎదురుగా ఉన్న బల్లపై పెట్టిన కాళ్లను ఊపుతూ ఆలోచిస్తున్నాడు. అతని పేరులో మూడు దీర్ఘాలూ, ఒక హ్రస్వం ఉన్నట్లే, ఆ బల్లకున్న నాలుగు కాళ్లలో మూడు పొడుగూ, ఒకటి కొంచెం పొట్టిదీ కావడం వలన అతని ఆలోచనలకు నేపథ్యంలా అతని కాళ్లతోపాటు ఊగుతూ 'ఠక్కు ఠక్కు' మని శబ్దం చేస్తోంది.

రామారావు వయస్సు నలభై అయిదు. భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పెద్దకూతురి పెళ్లి చేసి రెండేళ్లవుతోంది. రెండో కూతురికి సంబంధాలు చూస్తున్నాడు. పెద్ద కూతురి పేరు 'రమ', చిన్న కూతురి పేరు 'ఉమ'. కూతుళ్లిద్దరూ ఎంతో అణుకువగా వినయ విధేయతలతో, అంద చందాలతో ఆకర్షణీయంగా ఉంటారు. భార్య సంగతి సరేసరి — పేరుకు తగ్గట్టు అన్నపూర్ణే.

అల్లుడు పేరు సుబ్బారావు. అతని పేరులో 'బ'కారం ఎంత బరువుగా పలుకుతుందో, అంత లావుగా ఉంటాడు. సుబ్బారావు అన్ని విషయాలలోనూ తన మామగారికి పూర్తిగా వ్యతిరేకం. రామారావు తన పేరు దీర్ఘాలలాగే పొడుగ్గా ఉంటాడు. సుబ్బారావు పొట్టిగా, లావుగా ఉంటాడు. ఈ శరీరతత్వంలోనే కాకుండా మనోభావాలలో కూడా వ్యతిరేకమే. 'మామ దగ్గరనుండి ఎంత గుంజుదామా' అని అల్లుడు, 'అల్లుడికి సాధ్యమైనంతవరకు దొరకకుండా ఉండా'లని మామ. ప్రస్తుతం రామారావు ఆలోచిస్తున్నది కూడా అదే. పండుగలు దగ్గరలో లేకపోయినా, అల్లుడు ఎల్.టి.సి. పెట్టి వారం రోజులపాటు ఉండడానికి పెళ్లాం, పిల్లాడితో వస్తున్నట్లు రాశాడు. ఆ ఉత్తరం ఇప్పుడే పోస్ట్‌మాన్ ఇచ్చి వెళ్లాడు. అప్పటి నుంచి రామారావు ఆలోచిస్తున్నా, అతని ఆలోచన కుంటిగుర్రంలా పోతోంది కానీ రేసు గుర్రంలా పరుగెత్తడంలేదు. చివరకు రామారావు అల్లుడు ఉన్న వారంరోజులూ అల్లుడి కోరికలను సాధ్యమైనంతవరకూ తెలివిగా దాటవేయాలని నిశ్చయించుకున్నాడు. అందుకు తన పెద్దకూతురి సహాయం కూడా తీసుకోవాలనుకుని, తన ఆలోచనలను ఆపి ఇంటి అరుగు మీద నుంచి ఇంట్లోకి వెళ్లాడు.

* * *

అనుకున్న విధంగా కూతురు, అల్లుడు, మనుమడు వచ్చారు. ఆ రోజు సాయంత్రం కూతురుని పిలిచి తన స్థితిని వివరించి అల్లు డేమైనా అతిగా కోర్కెలు కోరితే, వాటిని తప్పించుకోడానికి ఆమె సహాయం కావాలని అడిగాడు. ఆమె కూడా "సరే" అంది.

మొదటిరోజు ప్రయాణం బడలిక వల్లనో, లేక మొదటి రోజునే మామగారిని ఇబ్బంది పెట్టడం ఇష్టం లేకనో సుబ్బారావు ఏమీ అడగలేదు. రెండోరోజు మధ్యాహ్నం అందరూ కలిసి భోజనం చేస్తూండగా సుబ్బారావు మామగారి నుద్దేశించి — "మామగారూ! ఈ నెలలో నేను స్కూటరు కొందామనుకుంటున్నాను. అఫ్‌కోర్స్, దానికి మీ సహాయం కూడా కావాలనుకోండి!" అన్నాడు.

రామారావుకి గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్లనిపించింది. "అమ్మ అల్లుడూ! పెద్ద మొత్తానికే టెండర్ వేశావు" అనుకుని పొలమారినట్లు నటించి, మంచినీళ్లు తాగి — "అదే అందా మనుకుంటున్నాను, అల్లుడుగారూ! మీకు బండి లేక ఇబ్బంది పడుతున్న విషయం నాకూ తెలుసు. మీ కోరికను సాధ్యమైనంత త్వరలో తీరుస్తాను!" అన్నాడు.

'మామగారు ఇంత త్వరగా బుట్టలో పడతారని అనుకోలేదు' అనుకుని, "అయితే, ఈ నెలాఖరుకి నేను ఓ స్కూటర్‌కి యజమానిని కాబోతున్నా నన్నమాట!" అని మర్మగర్భంగా అన్నాడు. పెద్ద కూతురు మాత్రం — 'ఏమిటి, తండ్రి తనతో ఒకలాగా, అల్లుడితో ఒకలాగా మాట్లాడుతున్నాడు?' అని విసుక్కుంది. అన్నపూర్ణ ఆందోళనగా భర్త ముఖంలోకి చూసింది.

రామారావు కంచంలో చేతులు కడుక్కుంటూ — "అలా కాదు, అల్లుడు గారూ! ఎలాగూ ఉమ పెళ్లి ఒకటి రెండు సంవత్సరాలలో చేసేద్దా మనుకుంటున్నాను. ఖర్చులో ఖర్చు. ఆ సమయంలో మీకు స్కూటరు కొంటాను. ఆ పెళ్లికి మీకు పెద్దల్లుడి హోదాతో ఒక బహుమతి ఇచ్చినట్లు ఉంటుంది!" అని, లేచి తన గదిలోకి వెళ్లిపోయాడు.

అంతవరకూ తండ్రికి, బావగారికి వడ్డిస్తున్న ఉమ తన పెళ్లి విషయం గురించి ప్రస్తావన రావడంతో సిగ్గనిపించి ఆ గదిలోనుంచి వెళ్లిపోయింది. సుబ్బారావుకి మటుకు ఒక్కసారిగా ఆకాశంలోనుంచి కింద పడ్డట్లు అనిపించింది. మామగారు తెలివిగా తన కోరికను వాయిదా వేశా రనిపించింది. కాని ఏమీ అనలేక ఎలాగోలా భోజనం అయిం దనిపించి భార్యను చూసి, "మీ నాన్న ఇలా నీ చెల్లెలి పెళ్లికి, స్కూటర్‌కి లింక్ పెట్టడం బాగాలేదు. అయినా నీ చెల్లెలికి పెళ్లి ఎప్పు డవుతుందో, ఏమో!" అని అంటూ, ఆ గదిలోకి మరదలు రావడం చూసి ఆమె ముందు ఏమీ మాట్లాడలేక తన గదిలోకి వెళ్లిపోయాడు.


అతనికి తెలుసు అదంతా మామగారి ప్లాన్ అని. గట్టిగా అడుగుదామంటే మామగారు మరదలి ముందు తన పరువు తీస్తారు. 'ఎంతైనా, అందమైన మరదలి ముందు తను బయటపడకూడదు!' అని నిశ్చయించుకుని, తెలివిగా, గొడవ చేయకుండా తన పని చేసుకోవాలని అనుకున్నాడు.

* * *

అన్నపూర్ణమ్మ ఇద్దరు కూతుళ్లతో కలిసి వంట గదిలో పిండివంటల తయారీలో నిమగ్నమై ఉన్నారు. రామారావు! గుర్రుపెట్టి నిద్ర పోతున్నాడు. సుబ్బారావు నెమ్మదిగా ఇంట్లోనుంచి బయటపడి, అలా ఏటి ఒడ్డుకి షికారు కెళ్లి, కాసేపు కూర్చుని ఆలోచించి, ఒక ప్లాన్ వేసుకుని, అటునుంచి అలా పోస్టాఫీసుకు వెళ్లి ఒక ఇన్‌లాండ్ లెటర్ కొనుక్కుని ఇంటికి వచ్చేశాడు.

మర్నాడు ఉదయం పది గంటలకు సుబ్బారావు ఇంట్లోనుంచి బయలుదేరి ఏటి ఒడ్డుకి చేరుకుని, జేబులోనుంచి ఇన్‌లాండ్ లెటర్, [illegible]న్న తీసి తన ప్రజ్ఞతో దాన్ని నింపేసి, కింద 'రామనాథం' అని సంతకం పెట్టి అడ్రసు దగ్గర తన పేరు, మామగారి ఇంటి అడ్రస్ రాసి పోస్టు చేయడానికి బయలుదేరాడు. ఆ ఉత్తరం ఈ ఊరి నుంచి కాకుండా, ఇంకొక ఊరి నుంచి వచ్చినట్లు ఉండాలని రాసిన ఉత్తరంగా, ఇంకొక ఊరిలో పోస్ట్ చేయించాలని నిశ్చయించుకుని, ఆ పల్లెటూరుకు రెండు

---



## బాలీవుడ్ బాణీ

### ఖాన్‌ల కొట్లాట

నిన్నటిదాకా 'భాయీ భాయీ' అనుకున్న అమీర్ ఖాన్, సల్మాన్ ఖాన్ ప్రస్తుతం బాహాబాహీ తలపడుతున్నారు. కారణ మెవరో తెలుసా? ఇంకెవరు, వాలుకళ్ల సుందరి కరిష్మా కపూరే! అమీర్, కరిష్మాలు జంటగా 'రాజా హిందూస్థానీ' అనే సినిమా నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో కరిష్మా నటన చూసిన తనకు కళ్లు తిరిగాయని, ఆమె చాలా అద్భుతంగా నటించిందంటూ పొగడ్తలతో ముంచెత్తుతూ ప్రకటనలు ఇచ్చాడు. వాటిని చూసి కరిష్మా తాజా ప్రియుడు సల్మాన్, అమీర్ భాయ్‌పై మండిపడుతున్నాడు.

— మసూద్ అన్సారి —

---



ఇటీవలి కాలంలో తన 51వ సంవత్సరంలో చనిపోయిన "ఆదిత్య విక్రమ్ బిర్లా" ప్రపంచంలోని 5,000 మంది కోటీశ్వరులలో ఒకడుగా పరిగణించబడ్డాడు. ఈయన ఆస్తి విలువ దాదాపు 8000 కోట్ల రూపాయలు. భారతదేశంలోనూ, కొన్ని ఆసియా దేశాల్లోనూ ఈయన 13 భారీ పరిశ్రమలను ప్రారంభించాడు.

ముద్దా రమణమూర్తి (ఎస్.పద్దపల్లి)

## మరో మోడల్ ...!

బాలీవుడ్‌లో సంచలనాలు సృష్టించిన దక్షిణాది మోడల్స్‌లో సుమన్ రంగనాథన్ ఒకరు. ఆకర్షణీయంగా ఉండి, దేనికైనా సిద్ధమని చెబుతున్న సుమన్‌కు, సహజంగానే చాలా ఆఫర్లు వస్తున్నాయి. ఆమెపై మనస్సు పారేసుకున్న వారిలో రాహుల్ రాయ్ ఒకరు. (ఆయన కాబోయే భార్యకు ఇది నిజంగా బాడ్ న్యూస్) 'ఫరేబ్' షూటింగ్‌లో ఈత కొలనులో నటించే సన్నివేశంలో సుమన్‌ను చూసి, మిగతా వారి సంగతి ఎలా ఉన్నా, రాయ్ మాత్రం కోలుకోలేకపోయాడు.

మసూద్ అన్సారి.




కిలోమీటర్ల దూరంలో ఉన్న బస్సులు, లారీలు తిరిగే ఒక రోడ్డుకి పొలం గట్లమీదనుంచి చేరుకుని అటునుంచి వెళ్తున్న ఓ లారీని ఆపి, “బాబూ! ఈ ఉత్తరం అర్జంటుగా వెళ్లాలి. పది కిలోమీటర్ల తర్వాత ఒక పెద్ద ఉత్తరా లాఫీసు — అంటే పోస్టాఫీసు ఉండే ఊరు వస్తుంది కదా! ఆ ఊళ్లో ఈ ఉత్తరం పోస్ట్ చెయ్యి! ఇదిగో, ఇదుంచు!” అని ఉత్తరం, ఒక రూపాయి నోటు ఆ లారీ క్లీనర్‌కి ఇవ్వబోతూ ఆగిపోయాడు. ఆ లారీ డ్రైవరు, క్లీనరు ఏమీ అర్థం కానట్లు చూస్తున్నారు. కొంతసేపటికి డ్రైవరు — “క్యా భాయ్! క్యా కామ్ హై? ముఝే తెల్గు నై ఆతా!” అన్నాడు.

'చచ్చేనురా భగవంతుడా!' అనుకుని, అటూ ఇటూ చూశాడు. ఏ వాహనమూ కనిపించకపోయేసరికి, ఇక తప్పదని తన హిందీ పరిజ్ఞానం గుర్తు చేసుకుంటూనూ— “ఇస్ పత్ర్ ... డాక్ ఘర్ ...” అని ఆగి, “డాలో!” అన్నాడు. అతని బాధంతా క్లీనర్‌కి అర్థమై, సుబ్బారావు చేతిలో ఉత్తరాన్నీ, రూపాయి నోటునీ తీసుకుని, “రైట్! రైట్!” అన్నాడు. లారీ వెళ్లిపోగానే సుబ్బారావు మళ్లీ పొలం గట్లవెంబడి ఇంటిదారి పట్టాడు.

ఆ రోజూ, మర్నాడు ఉదయం ఏ విశేషం లేకుండానే జరిగిపోయాయి. మధ్యాహ్నం భోజనాలు చేసి అందరూ కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. సుబ్బారావు మాత్రం నిమిష నిమిషానికి వాచీ కేసి, వీధికేసి చూస్తున్నాడు. “ఈ పాచిక నుంచి ఎలా తప్పించుకుంటావో చూద్దాం” అనుకుంటూ మామగారి వైపు కూడా చూస్తున్నాడు.

'పోస్ట్' అన్న కేక వినపడడంతో గుమ్మానికి దగ్గరగా ఉన్న రామారావు లేచి వెళ్లి ఉత్తరాన్ని అందుకుని, దాని మీద సుబ్బారావు పేరు చూసి 'నీదేనోయ్ ఈ ఉత్తరం' అంటూ సుబ్బారావుకి ఉత్తరం అందించాడు.

“అయితే ఈ క్లీనరు చాలా మంచివాడన్నమాట” అప్రయత్నంగా అన్నాడు సుబ్బారావు ఉత్తరం మీద అడ్రస్ చూస్తూ.

“క్లీన రేమిటోయ్?” అర్థంకాక రామారావు అడిగాడు.

“క్లీనరంటే క్లీనరు కాదనుకోండి. ఈ ఉత్తరం రాసిన రామనాథం నా కొలీగ్. అతను ఆఫీసుకి వచ్చినప్పటి నుంచి ఏవో ఒకటి శుభ్రం చేస్తూ ఉంటాడండి. అందుకే వాడిని మేము సరదాగా 'క్లీనర్' అంటూంటామండీ” అని నమ్మించడానికి ప్రయత్నిస్తూ ఉత్తరాన్ని విప్పి చదివినట్లు నటించాడు.

వెంటనే ఎంతో సంతోషంతో “మామగారూ ! మా క్లీనర్ రామనాథం అతి ముఖ్యమైన విషయం రాశాడు. మీరు కూడా చదవండి” అని ఉత్తరం అందించాడు. రామారావు అల్లుడివైపు సాలోచనగా చూసి, ఉత్తరా న్నందుకుని చదువుదామని ప్రయత్నం చేసి ఒక ముక్కా కొరుకుడు పడక 'లాభం లేదల్లుడూ ! నువ్వే చదువు” అన్నాడు ఉత్తరాన్ని తిరిగి సుబ్బారావు కందిస్తూ.

సుబ్బారావు ఉత్తరా న్నందుకుని గొంతు సవరించుకుని మొహం గంభీరంగా పెట్టి (అంటే తన మొహంలో భావాలు కనపడకుండా) చదవడం మొదలుపెట్టాడు.

“ఒరే సుబ్రావు... గెట్లుండావ్? పెళ్లాం, పోరడు మంచిగున్నా రనుకుంటా. మీ మామ మెట్లుండాడు? ఇక్కడ వీ కామ్ చూడ్నేక గొప్ప పరిషానయిపోతుండ్రా. గది గట్లుండె నీతో జర జరూర్ కామున్నది. నిన్న రేతిరి నా పురాన దోస్తొక డొచ్చిండు వాని దగ్గర పూరా కండీషన్‌లో నున్న స్కూటరున్నది. వానికి జరూరుగా పైసలవసరమొచ్చి దాని నమ్ముతానంటుండు. పైసలు మటుకు వెంటనే ఇచ్చియాలనంటుండాడు. కనుక నువ్వు జల్దీ వచ్చి ఆ స్కూటర్ సంగతి చూస్కో. పైసల సంగతి యాదుంచుకో శెలవ్.. రామనాథం” అని ఉత్తరం చదవడం పూర్తి చేశాడు సుబ్బారావు.

“ఆ కేకలకి అర్థం ఏమిటి నాయనా?” అడిగారు అత్తగారు. రామారావు కూడా ఆ ఉత్తరం అర్థం కానట్టుగా మొహం పెట్టాడు. వెంటనే ఆ ఉత్తరానికి అర్థం చెప్పకపోతే ప్రయత్నం వృధా అవుతుందని ఆ ఉత్తరం సారాంశం చెప్పాడు.

అది వినగానే రామారావుకి అర్థం అయింది. అది సుబ్బారావు స్కూటరుకి వేసిన పథకమని.

రామారావు ఏమీ మాట్లాడకపోవడం చూసి, సుబ్బారావు తన భార్య కేసి చూసి “రమా ! నా బట్టలు సర్దు. అర్జంటుగా మన ఊరికి వెళ్లాలి” అని లోపలికి వెళ్లిపోయాడు.

అత నలా వెళ్లగానే రామారావు చురుకుగా ఆలోచించి, సుబ్బారావు దగ్గరికి వెళ్లాడు.

మామగారు దారిలో పడ్డారని, డబ్బు విషయం మాట్లాడడానికి ఇప్పుడు తన దగ్గరికి వచ్చారని సుబ్బారావు మనసులో తెగ ఆనందపడిపోయాడు.

“అల్లుడుగారూ ! మీరు ఇప్పుడు వెళ్లకతప్పదా” అంటూ అక్కడ కుర్చీలో కూర్చున్నాడు. “తప్పదండీ. ఇలాంటి అవకాశం మళ్లీరాదు. అయినా ఎప్పుడో మీ రెండో అమ్మాయి పెళ్లిలో ఇచ్చే కొత్త స్కూటరు కన్నా, ఇప్పుడు ఈ సెకండ్ హాండ్ స్కూటరు నయం కదండీ. కనుక ఈ విషయంలో మీరు తప్పక సహాయం చెయ్యాలి” అంటూ తన ఉద్దేశం బయటపెట్టాడు.

రామారావు ఒక్కసారిగా కుర్చీలోంచి లేచి గుమ్మం దగ్గరికి వెళ్లి “అల్లుడికి సెకండ్ హాండ్ స్కూటర్ కొనిచ్చాడన్న అపకీర్తి నాకు వచ్చినా, కొత్త స్కూటరు కొనిపించలేకపొయ్యావని నీ స్నేహితులు నిన్ను అవమానపరుస్తారు. అది నాకు ఇష్టంలేదు. అయినా ఆ యోగం రావాలి కదా ! అప్పుడు మీరు వద్దన్నా మీ దగ్గరికి ఆ స్కూటరు పరుగెత్తుకుని వస్తుంది. అంతగా మీరు ఉత్సాహపడుతున్నారు కనుక నేను కొంచెం తొందరగానే ప్రయత్నిస్తాను. కాని ప్రస్తుతానికి నన్ను క్షమించండి” అంటూ ఆ గదిలోంచి బయటికి వెళ్లిపోయాడు.

ఈ పథకం గురించి తన పడ్డ శ్రమంతా సినిమా రీళ్లలా కళ్లముందు కనిపించి మంచం మీద కూలబడ్డాడు సుబ్బారావు. అయినా పట్టువదలని విక్రమార్కుడిలాగ ఇంకో పథకం కోసం ఆలోచించసాగాడు. మామగారు మాట్లాడిన విషయంలో 'యోగం' అన్న పదం గుర్తుకు వచ్చి, ఒక ఆలోచన మెరుపులా తట్టింది. “నిన్ను ఈసారి సెంటిమెంట్‌తో దెబ్బతీస్తున్నాను మామా !” అనుకుంటూ ఆ పథకానికి తుదిమెరుగులు దిద్దుతూ కుర్చీలోనే నిద్రపోయాడు.

❀ ❀ ❀

సాయంత్రం అందరూ ఎవరి పనులలో

వాళ్లుండడం చూసి ఇంట్లోంచి బయటపడ్డాడు సుబ్బారావు. ఆ ఊరి చివరిలో ఉన్న గుడికి వెళ్లాడు. ఆ గుడి పూజారికి జ్యోతిష్యంలో మంచి ప్రావీణ్యం ఉందన్న విషయం సుబ్బారావుకి తెలుసు. ఆ పూజారితో కొంచెంసేపు మాట్లాడి, అయన చేతిలో యాభై నోటు పెట్టి ఇంటికి వచ్చేశాడు. ఆ రోజు రాత్రి అతనికి నిద్రలో తనకి మామగారు స్కూటరు కొని ఇచ్చినట్టుగానూ, తమ హైదరాబాదులో ఆఫీసుకి దాని మీద వెళుతున్నట్లుగా కలగన్నాడు.

మర్నాడు ఉదయం లేచేసరికి ఎనిమిది గంటలయ్యింది. అలా పెరట్లోకి వచ్చి పల్లెటూరి పద్ధతిలో పళ్లు తోముకుందామని, వేప చెట్టు కిందకి వెళ్లి చేతి కందిన కొమ్మ వంచబోతుండగా "కోతి బావ... కోవెల" అన్న మాటలు వినబడ్డాయి పట్టుకున్న కొమ్మని వదిలేసి అటువైపు తిరిగి చూశాడు. బిందె పట్టుకుని నవ్వుకుంటూ వెళ్తున్న మరదలు కనిపించింది. నిజానికి ఆ అమ్మాయి "కోతిబావకు పెళ్లంటా కోవెలతోటా విడిదంట" అని పాట పాడుతోంది. కాని సుబ్బారావుకి ఆ రెండు పదాలు తప్ప మిగిలిన మాటలేవీ వినబడలేదు.

"తను సాయంత్రం కోవెలకి వెళ్లడంగానీ చూసిందేమిటబ్బా" అని భుజాలు తడుముకుని దంతధావనం ముగించి, కాఫీ గ్లాసుతో అరుగు మీదకు వచ్చి కూర్చున్నాడు. అంతలో మామగారు కూడా వచ్చి అక్కడ కూర్చుని ఆ మాట, ఈ మాట మాట్లాడసాగాడు. సమయం చూసి చాలా నేర్పుగా తనకు జాతకాల పిచ్చి అని, జ్యోతిష్యం మీద అపారమైన నమ్మకమని, ఈ మధ్య ఆ నమ్మకం ఎక్కువయిందని, అదని, ఇదని చాలాసేపు కోశాడు. మామగారు కూడా ఆ మాటలు జాగ్రత్తగా విన్నారు. తర్వాత స్నానం చేయడానికి సుబ్బారావు లోపలికి వెళ్లాడు.

స్నానం చేస్తుండగా "నే నలా బైటికి వెళ్తున్నాను. నా కోసం చూడకుండా మీరు ఫలహారం చేసేయండి" అని అల్లుడికి చెప్పి రామారావు వెళ్లిపోయాడు. సుబ్బారావు స్నానం చేసి వచ్చి ఫలహారం ముగించి మళ్లీ అరుగు మీదకు వచ్చి కూర్చున్నాడు.

మామగారు లేని సమయంలో పూజారిగారు వస్తే తన ప్లానంతా బెడిసికొడుతుందని తెగ బాధపడిపోతున్నాడు సుబ్బారావు. అంతలో దూరంగా మామగారు వస్తుండడం చూసి హాయిగా ఊపిరి పీల్చుకున్నాడు. "ఫలహారం చేశారా అల్లుడుగారూ !" అంటూ రామారావు వచ్చి ఆ అరుగు మీదే కూర్చున్నారు. ఇంతలో రమ వచ్చి ఇద్దరికి కాఫీ ఇచ్చింది. ఆ కాఫీ తాగుతూ ఇద్దరూ ఆ ఊరి రాజకీయాల గురించి మాట్లాడుకోవడం మొదలుపెట్టారు. కాని ఇద్దరి మనసులతో వేరే విషయాలు ఉన్నాయి. అయినా లేని నవ్వు తెచ్చిపెట్టుకుని సంభాషణ సాగిస్తున్నారు.

"నమస్కారం రామారావుగారూ !" అంటూ పూజారి వచ్చారు. "మంచి సమయానికి వచ్చారు కూర్చోండి" అన్నారు రామారావు.

"ఇతను మీ అల్లుడు సుబ్బారావు కదూ !" అంటూ అరుగు మీద కూర్చున్నారు.

"అవును మొన్నే అమ్మాయి, అల్లుడు వచ్చారు. ఇతనికి జాతకాలన్నా, జ్యోతిష్యమన్నా మంచి గురి. ఓసారి మా అల్లుడుగారి చెయ్యి చూస్తారేమిటి?" అన్నారు రామారావు.

వెతకబోయిన తీగ కాలికి తగిలిందని తెగ సంతోషపడిపోతూ, తన పథకం పారాలని దేవుడ్ని ప్రార్థిస్తూ, పూజారిగారికి కళ్లతో సైగలు చేసి, చెయ్యిని ముందుకు చాపాడు సుబ్బారావు.

వంద రూపాయల నోటుని అందుకున్నంత ఆత్రంగా ఆ చేతిని అందుకుని కొంచెంసేపు పరిశీలించి "మహా భేషుగ్గా ఉందండీ, మీ అల్లుడి జాతకం, కానీ..." అంటూ ఆగిపోయారు పూజారిగారు.

"ఆ కానీండి... చెప్పండి" అన్నారు రామారావు.

"చెప్పండి.. సందేహించకండి" అంటూ తొందరపెట్టాడు సుబ్బారావు.

"ఏమీ లేదండి మీ అల్లుడి జాతకం అంతా బావుంది కాని, అతనికి 'వాహనగండం' ఉంది" అని అన్నారు పూజారి.

"ఏం చేస్తాం అల్లుడుగారూ ! మీ ఆరాటం చూసి రాత్రంతా ఆలోచించాను. ఈ నెల పంట డబ్బులు రాగానే మీకు స్కూటరు కొనిద్దామనుకున్నాను. సమయానికి పూజారి గారొచ్చి దేముడిలా ఆదుకున్నారు. లేకపోతే చాలా ఇబ్బంది పడాల్సి వచ్చేది" అన్నారు రామారావు చాలా సంతోషంగా.

"నా కింక సెలవిప్పించండి రామారావుగారూ" అంటూ బయలుదేరారు పూజారి.

"చాలా అదృష్టమంతులమోయ్" అంటూ రామారావు లోపలికి వెళ్లారు.

అదృష్టం తనదో, మామగారిదో అర్థంకాక, కోపంగా వీధిలోకి పరుగెత్తుకుంటూ వెళ్లి పూజారిని ఆపి "ఏమయ్యా ! నిన్న యాభై ఇచ్చి వాహనయోగం ఉందని చెప్పమంటే, వాహనగండం ఉందని చెప్తావా! కక్కు నా యాభై" అంటూ అరిచాడు.

పూజారి తాపీగా "చూడు నాయనా! నువ్వు నిన్న నాకు యాభై ఇచ్చావు సరే... పొద్దున్నే మీ మామగారు వచ్చి వంద ఇచ్చారు. ఎందుకంటావు? నీకు వాహనగండం ఉందని చెప్పటానికి. ఇదంతా నువ్వు చేతులారా చేసుకున్నదే. నువ్వే చెప్పావుట మీ మామగారికి. నీకు జ్యోతిష్యం అంటే మంచి గురి అని. అంతే ఆయన నా దగ్గరకు వచ్చి నీకు తెలియకుండా వచ్చానని చెప్పి నీకు వాహనగండం ఉందని చెప్పమన్నారు. నిన్న నువ్వు వచ్చినట్లు ఆయనకి తెలీదు. ఏం చేస్తాంలే అంతా నువ్వు చేసుకున్నదే. ఇంద నీ యాభై" అంటూ డబ్బుల్ని సుబ్బారావు చేతిలో పెట్టి కదిలారు.

ఇంక స్కూటరు మీద ఆశ వదిలేసుకుని, నీరసంగా కాళ్లీడ్చుకుంటూ ఇంటివైపు బయలుదేరాడు.

దూరంగా మైకుతోంచి పాట వినిపిస్తోంది.

"అంతా భ్రాంతియేనా...
జీవితాన వెలుగింతేనా..." ○

## బాలీవుడ్ బాణీ



### మరో భగ్నజీవి

బాలీవుడ్‌లో ఎంత స్పీడ్‌గా ప్రేమలో పడతారో అంతే స్పీడుతో తిరిగి విడిపోతుంటారు. 'ఆంఖే' అమ్మాయి రితూ శివపురిని తాజా భగ్న ప్రేమికురాళ్ల జాబితాలో చేర్చవచ్చు. కనుక సాద్నాతో ప్రేమ కాస్తా ఫెయిల్ కావడంతో ఇకపై బుద్ధిగా ఉండాలనే నిర్ణయానికి ఆ అమ్మాయి వచ్చిందట. అన్నట్లు కమల్ మాజీ ప్రేయసి అమృతాసింగ్ ఈ విషయం తెలుసుకుని రీతూను ఓదార్చే ప్రయత్నాలు చేస్తున్నదట. పాపం! ఆమెది కూడా అదే పరిస్థితి కదా ఒకప్పుడు!

మసూద్ అన్సారి